సర్వే పూర్తి.. మంజూరెప్పుడో?

- 99 శాతం పూర్తయిన ఇందిరమ్మ ఇళ్ల సర్వే
- పగలు, రాత్రి తేడా లేకుండా పూర్తి చేసిన సిబ్బంది
- రెబ్బెన మండలంలో మొత్తం 10,725 దరఖాస్తులు


దరఖాస్తుదారు ఫొటోను యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్న ఎంపీడీవో శంకరమ్మ

రెబ్బెన: పేదోడి సొంతింటి కలను సాకారం చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా అధికారంలోకి వస్తే ఇల్లు లేని ప్రతీ ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చింది. ఈమేరకు ప్రభుత్వం పేదలకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసే దిశగా అడుగులు వేస్తోంది. ఇప్పటికే ప్రజాపాలనలో ఇందిరమ్మ ఇళ్ల కోసం ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. లక్షల్లో దరఖాస్తులు రాగా అర్హులైన లబ్ధిదారులను గుర్తించేందుకు ప్రభుత్వం గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల సర్వే కార్యక్రమాన్ని చేపట్టింది. అన్ని గ్రామాల్లో ఈ సర్వే ప్రక్రియ దాదాపు పూర్తయ్యింది. ఒక్కటి, రెండు పంచాయతీలు మినహా అన్ని పంచాయతీల్లో పంచాయతీ కార్యదర్శులు దరఖాస్తుదారుల వివరాలను, ప్రస్తుతం ఉన్న ఇంటితో పాటు ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి అందుబాటులో ఉన్న ఖాళీ స్థలాల ఫొటోలను ప్రభుత్వం రూపొందించిన ప్రత్యేక యాప్‌లో నమోదు చేశారు.

ఉరుకులు పరుగులతో ఇళ్ల సర్వే..

రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల మంజూరు కోసం చేపట్టిన సర్వే ప్రక్రియను అధికార యంత్రాంగం ఉరుకుల పరుగులతో పూర్తి చేసింది. సర్వే ప్రక్రియలో పంచాయతీ కార్యదర్శులు పూర్తి బాధ్యత తీసుకున్నారు. రోజువారి టార్గెట్‌లకు అనుగుణంగా పగలు, రాత్రి అని తేడా లేకుండా సర్వే పూర్తి చేశారు. సర్వే పూర్తి చేసేందుకు ప్రభుత్వం నిర్దిష్టమైన గడువు విధించకపోయిన ఉన్నతాధికారులు పంచాయతీ కార్యదర్శులపై ఒత్తిడి పెంచి సర్వేను పూర్తి చేయించారు. ప్రజా పాలనలో వచ్చిన దరఖాస్తుల ఆధారంగా పంచాయతీ కార్యదర్శులు దరఖాస్తుదారుల ఇంటికి వెళ్లి ప్రభుత్వం ప్రత్యేకంగా రూపొందించిన యాప్‌లో వివరాలను నమోదు చేశారు. ప్రభుత్వం ఇందిరమ్మ ఇంటిని మంజూరు చేస్తే దాన్ని నిర్మించుకునేందుకు అందుబాటులో ఉన్న స్థలం, దానికి సంబంధించిన ధ్రువపత్రాలు, స్థలానికి సంబంధించిన పత్రాలు అందుబాటులో లేని పక్షంలో దరఖాస్తుదారుడు ప్రస్తుతం నివాసం ఉంటున్న ఇంటి కరెంట్ బిల్లు, ఇంటి పన్ను రశీదు, దరఖాస్తుదారుడు ప్రస్తుతం నివాసం ఉండే ఇంటి ఫొటో, ఇంటి పైకప్పు, గోడల రకం ఫొటో తదితర వివరాలను యాప్‌లో అప్‌లోడ్ చేశారు.

99శాతం సర్వే పూర్తి

మండలంలోని 24 గ్రామ పంచాయతీల్లో ఇందిరమ్మ ఇళ్ల కోసం 10,725 దరఖాస్తులు అందాయి. వాటిలో ఇందిరమ్మ ఇళ్ల సర్వే ప్రక్రియ ద్వారా ఇప్పటి వరకు 10,650 వరకు సర్వే పూర్తి చేశారు. మండలంలో 22 గ్రామ పంచాయతీల్లో సర్వే 100 శాతం పూర్తి కాగా రెబ్బెనతో పాటు మేజర్ గ్రామ పంచాయతీ గోలేటిలో అతికొద్ది దరఖాస్తులు మాత్రమే మిగిలి ఉన్నాయి. ఒకటి, రెండు రోజుల్లో మిగిలిన దరఖాస్తులను సైతం పూర్తి చేసేలా అధికారులు చర్యలు చేపట్టారు. 100 శాతం సర్వే పూర్తి చేసిన గ్రామపంచాయతీల కార్యదర్శులను మిగిలిన గ్రామపంచాయతీల్లో సర్వే విధులు అప్పగించటంతో అధికారులు అనుకున్న సమయం కంటే ముందే సర్వేను దాదాపు పూర్తి చేశారు.

గ్రామసభల ద్వారా లబ్ధిదారుల ఎంపిక

ఇందిరమ్మ ఇళ్ల మంజూరుకు అర్హులైన లబ్ధిదారులను గ్రామసభల ద్వారా ప్రభుత్వం ఎంపిక చేయనుంది. ఇప్పటికే గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల కమిటీలను ఏర్పాటు చేయగా కమిటీ సభ్యులు, గ్రామసభల్లో ప్రజల సమక్షంలో అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేసేలా చర్యలు చేపట్టినట్లు సమాచారం. ప్రభుత్వం మొదటి విడతగా నియోజకవర్గానికి 3500 చొప్పున ఇందిరమ్మ ఇళ్లను మాత్రమే మంజూరు చేసే అవకాశం ఉండటంతో గ్రామపంచాయతీలకు ఎన్నేసి ఇళ్లు మంజూరు చేస్తారదానిపై సందిగ్ధం నెలకొంది. ప్రజల నుంచి వేలాది సంఖ్యలో దరఖాస్తులు రాగా ప్రభుత్వం అరకొరగా ఇళ్లు మంజూరు చేస్తే ఇళ్లు రాని వారి నుంచి వ్యతిరేకత వచ్చే అవకాశం కూడా ఉంది.

ఒకటి, రెండు రోజుల్లో పూర్తి

మండలంలో ఇందిరమ్మ ఇళ్ల సర్వే ప్రక్రియ దాదాపు పూర్తయింది. కేవలం గోలేటి, రెబ్బెన గ్రామపంచాయతీల్లో కొన్ని దరఖాస్తులు మిగిలి ఉన్నాయి. వాటిని సైతం ఒకటి, రెండు రోజుల్లో పూర్తి చేసి 100శాతం పూర్తి చేస్తాం. ప్రభుత్వం రూపొందించిన ప్రత్యేక యాప్‌లో దరఖాస్తుదారునికి సంబంధించి ప్రభుత్వం అడిగిన అన్ని వివరాలను అప్‌లోడ్ చేస్తున్నాం.

– వాసుదేవ్, ఇన్‌చార్జి పంచాయతీ అధికారి, రెబ్బెన

క్లుప్తంగా

మట్టిరోడ్డుకు మరమ్మతులు


పనులు ప్రారంభిస్తున్న పుష్పలత

బెజ్జూర్: మండలంలోని మోగవెల్లి గ్రామం నుంచి గూడెం గ్రామం వరకు గల ప్రధాన రహదారి మరమ్మతులకు ఎమ్మెల్సీ దండే విఠల్ నిధులు మంజూరు చేయగా మాజీ జెడ్పీటీసీ పంద్రం పుష్పలత కొబ్బరికాయ కొట్టి గురువారం పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎమ్మెల్సీ దండే విఠల్ సహకారంతో రోడ్డు పనులను చేపడుతున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు జంగిటి మల్లేశ్, సల్మాన్ ఖాన్, ఇగురపు వెంకటేశ్, షణ్ముఖ చారి, మద్దూరి రంగన్న, గ్రామస్తులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

కెరమెరి: చలో దీక్ష భూమి కొత్తపల్లి జాతర పోస్టర్‌ను గురువారం మండల కేంద్రంలో సేవాలాల్ సేనా జిల్లా అధ్యక్షుడు రూప్‌లాల్ నాయక్ ఆవిష్కరించారు. ఈ నెల 11 నుంచి 17 వరకు నార్నూర్ మండలంలోని కొత్తపల్లిలో 46వ గురుకృపా దినోత్సవం సందర్భంగా జాతర నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా రూప్‌లాల్ నాయక్ మాట్లాడారు. గురుప్రేం సింగ్ మహరాజ్ ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకోనుందని, ప్రజలు అధిక సంఖ్యలో వచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రాథోడ్ శంకర్‌నాయక్, రాథోడ్ రమేశ్, రామావత్ నరహరిదాస్, రాథోడ్ బలిరాం నాయక్, జాటోత్ తిరుపతి, బానోత్ శివ, హక్యా నాయక్ తదితరులు ఉన్నారు.

ఉపాధ్యాయులకు ఘనంగా వీడ్కోలు


సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

కెరమెరి: మండలంలోని గోయగాం కాంప్లెక్స్ పరిధిలో ఉన్న వివిధ పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు కొద్ది నెలల క్రితం బదిలీ, పదోన్నతులపై ఇతర పాఠశాలలకు వెళ్లగా వారిని గోయగాం ఉన్నత పాఠశాలలో సన్మానించారు. బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు రతన్, దివ్యశ్రీ, శిరీష, విమల, రమేశ్, కృష్ణమూర్తి, కవిత, గీత, లెవన్‌కుమార్‌లను శాలువా, మెమొంటోతో గురువారం సత్కరించారు. కార్యక్రమంలో ఎంఈవో ఆడే ప్రకాశ్, ఉపాధ్యాయులు రమేశ్, రంగయ్య, సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి


విద్యార్థినులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

కౌటాల: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని హెచ్‌ఎం సోయం ఇందురావ్ అన్నారు. మంచిర్యాలలో నిర్వహించిన కరాటే కుంగ్‌ఫు చాంపియన్‌షిప్ పోటీల్లో ప్రతిభ కనబర్చిన మొగడ్‌దగడ్ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థినులు ఎలేకర్ మోహిని, కన్నాకే ప్రియాంక, ఎలేకర్ పల్లవిని గురువారం అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థులు అన్ని రంగాల్లో ముందుండి జీవితంలో ఉన్నతంగా ఎదగాలని తెలిపారు. బాలికలు తమ ఆత్మరక్షణ కోసం కరాటే నేర్చుకోవాలన్నారు. పిల్లలు సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని, క్రమశిక్షణ కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో కరాటే మాస్టర్ అంజన్న, ఉపాధ్యాయులు గంగాసింగ్, సంతోష్, విద్యారాణి తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

రెబ్బెన: గంగాపూర్‌లోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో ఖాళీగా ఉన్న పీజీ సీఆర్టీ ఫిజిక్స్ పోస్టును తాత్కాలిక పద్ధతిన భర్తీ చేసేందుకు ఆసక్తి గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఎస్‌వో పద్మ ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెస్సీ బీఈడీ పూర్తి చేసిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులన్నారు. కుమురం భీం జిల్లాకు చెందిన అభ్యర్థులకు ప్రాధాన్యత ఉంటుందని, మెరిట్ ఆధారంగా నియమించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 11వ తేదీ సాయంత్రం 4.30 గంటల లోగా కేజీబీవీలో తమ దరఖాస్తులు సమర్పించాలని కోరారు.

ముగ్గుల పోటీలు


ముగ్గులు వేస్తున్న కళాశాల విద్యార్థినులు

వాంకిడి: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం సంక్రాంతి పండుగ పురస్కరించుకుని ముందస్తు సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా రంగవల్లి కార్యక్రమం ఏర్పాటు చేసి ముగ్గుల పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థినులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ చంద్రయ్య, బోధన సిబ్బంది పాల్గొన్నారు.

యువతకు వాలీబాల్ కిట్టు అందజేత


వాలీబాల్ కిట్టు అందజేస్తున్న ఎస్సై

దహెగాం: మండలంలోని హత్తిని గ్రామంలోని యువతకు గురువారం ఎస్సై వాలీబాల్ కిట్టు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శేగం రాకేశ్ వాలీబాల్ కిట్టును సొంతంగా అందించడం హర్షనీయమన్నారు. గ్రామీణ యువత చెడు వ్యసనాలను వీడాలని సూచించారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడవద్దన్నారు. యువకులు ఐక్యంగా ఉండి గ్రామాభివృద్ధికి పాటు పడాలన్నారు. కార్యక్రమంలో సహకార సంఘం వైస్‌చైర్మన్ రాపర్తి ధనుంజయ్, గ్రామస్తులు కోండ్ర రాజాగౌడ్, శ్రీకాంత్ యువకులు పాల్గొన్నారు.

రహదారి మాసోత్సవాలు విజయవంతం చేయాలి

- కలెక్టర్ వెంకటేశ్ దోత్రే


మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

ఆసిఫాబాద్: జిల్లాలో చేపట్టిన రహదారి భద్రత మాసోత్సవాలను విజయవంతం చేయాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో గురువారం జిల్లా రహదారుల భద్రతా కమిటీ సమావేశం అదనపు కలెక్టర్ దీపక్ తివారీ, కాగజ్‌నగర్ సబ్‌కలెక్టర్ శ్రద్ధా శుక్లాతో కలిసి పోలీస్, రెవెన్యూ, రవాణా, రోడ్లు భవనాలు, గ్రామీణాభివృద్ధి, ఇంజినీరింగ్, విద్యా శాఖల అధికారులతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 31 వరకు రోడ్డు భద్రతా మాసోత్సవాలు పురస్కరించుకొని జిల్లాలోని పట్టణాలు, గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. విద్యార్థులతో ర్యాలీలు, వ్యాసరచన పోటీలు నిర్వహించాలని తెలిపారు. గతేడాది జిల్లాలో 239 రోడ్డు ప్రమాదాలు జరిగాయని, 45 ప్రాంతాల్లో బ్లాక్‌స్పాట్‌లను గుర్తించామని, ఆ ప్రాంతాల్లో ప్రమాదాల నివారణ కోసం వేగనియంత్రణ సూచిబోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. రహదారులు, కల్వర్టుల మరమ్మతులు చేపట్టాలని, నిర్మాణ పనులు పూర్తి చేయాలన్నారు. రహదారులపై ప్రమాదాలు జరిగే క్షతగాత్రులను ఆసుపత్రులకు తరలించేందుకు హైవే టోల్‌ఫ్రీ నంబర్ 1033కి సమాచారం అందించాలని, సమీప ఆసుపత్రికి వెంటనే తరలించాలని తెలిపారు. జాతీయ రహదారికి సమీపంలో ఉన్న గ్రామాల్లో సర్వీస్‌రోడ్లు, మురుగుకాల్వల నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టాలని, చిల్డ్రన్ రోడ్ సేఫ్టీ పార్కుల ప్రదేశాలను గుర్తించాలని తెలిపారు. మున్సిపాలిటీ, మండల కేంద్రాల్లో రహదారుల ఆక్రమణలు జరగకుండా సంబంధిత అధికారులు ఎప్పటిప్పుడు పర్యవేక్షించాలని తెలిపారు. ఆర్‌అండ్‌బీ ఈఈ సురేశ్, ఆర్టీవో రాంచందర్, డీఎంహెచ్‌వో సీతారాం, డీఆర్‌డీవో దత్తారావు, డీపీవో బిక్షపతి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించాలి


రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

ఆసిఫాబాద్‌రూరల్: రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో రాణించాలని మాజీ ఎంపీపీ మల్లి కార్జున్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఆదర్శ క్రీడా పాఠశాలలో హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా హ్యాండ్‌బాల్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కోచ్ అరవింద్ మాట్లాడుతూ ఉమ్మడి జిల్లా నుంచి మొత్తం 100 మంది క్రీడాకారులు పాల్గొన్నారని, ఉత్తమ ప్రతిభ కనబర్చిన 16 మందిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారన్నారు. వీరికి ఈ నెల 11 నుంచి 17వ తేదీ వరకు జిల్లా కేంద్రంలోని ఆదర్శ క్రీడా పాఠశాలలో క్యాంపు (శిక్షణ) కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 18 నుంచి 20వ తేదీ వరకు కరీంనగర్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో ఏసీఎంవో ఉద్ధవ్, హెచ్‌ఎం జంగు, హ్యాండ్‌బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి రమేశ్, పీడీలు రాకేశ్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఫాతిమా షేక్ జయంతి


చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంఈవో

బెజ్జూర్: తొలి ముస్లిం మహిళ ఉపాధ్యాయురాలు ఫాతిమా షేక్ 194వ జయంతిని మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంఈవో సునీత, మాజీ ఎంపీటీసీ పర్వీన్ సుల్తానా ముఖ్యఅతిథిగా హాజరై ఫాతిమాషేక్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎంఈవో సునీత మాట్లాడుతూ భారత దేశ మొట్టమొదటి ముస్లిం మహిళా ఉపాధ్యాయులు ఫాతిమా షేక్ అందించిన సేవలు మరువలేనివని కొనియాడారు. అనంతరం మాజీ ఎంపీటీసీ పర్వీన్ సుల్తానా మాట్లాడుతూ 1831 పూణేలో జన్మించిన ఫాతిమా షేక్ అమెరికన్ మిషనరీ స్కూల్‌లో విద్యను అభ్యసించారని పేర్కొన్నారు. బాలికలకు విద్యలో ప్రోత్సహించడానికి ఫాతిమా షేక్ చాలా కృషి చేశారన్నారు. సంఘ సంస్కర్త మహాత్మా జ్యోతిరావు పూలే దంపతులతో కలిసి ఫాతిమా షేక్ అనేక పాఠశాలలను నెలకొల్పారన్నారు. అణగారిన వర్గాల విద్యాభివృద్ధికి సోదరుడు ఉస్మాన్ షేక్‌తో కలిసి ఎనలేని కృషి చేశారన్నారు. కార్యక్రమంలో కోలావర్ సంఘం మండల అధ్యక్షుడు పెద్దల శంకర్, నాయకులు జావిద్ అలీ, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాఠశాలలో మధ్యాహ్న భోజనం పరిశీలన


భోజనం చేస్తున్న తహసీల్దార్ వెంకటేశ్వర్‌రావు

పెంచికల్‌పేట్: మండలంలోని సంజీవనగర్ ప్రాథమిక పాఠశాలను గురువారం పెంచికల్‌పేట్ తహసీల్దార్ వెంకటేశ్వర్‌రావు తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, మధ్యాహ్న భోజన మెనూ రిజిస్టర్లను పరిశీలించి పలు సూచనలు చేశారు. పాఠశాలల ఆవరణలో విద్యార్థులు వేసిన రంగు రంగుల ముగ్గులను పరిశీలించి విద్యార్థులను అభినందించారు. ఆయన వెంట ఆర్‌ఐ సురేశ్, హెచ్‌ఎం ప్రియాంక, ఉపాధ్యాయులు సతీశ్, తిరుమల ఉన్నారు.

పరీక్షప్యాడ్లు అందజేత


ఎగ్జామ్ ప్యాడ్లతో నంబాల జిల్లా పరిషత్ విద్యార్థులు

రెబ్బెన: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పదవ తరగతి చదువుతున్న 350 మంది విద్యార్థులకు గురువారం తాజా మాజీ జెడ్పీటీసీ వేముర్ల సంతోష్ పదవ తరగతి వార్షిక పరీక్షలు దృష్టిలో పెట్టుకుని ఎగ్జామ్ ప్యాడ్స్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో జరగనున్న వార్షిక పరీక్షల కోసం విద్యార్థులు సంసిద్ధం కావాలన్నారు. పరీక్షలంటే ఉన్న భయాన్ని వీడి ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చెన్న సోమశేఖర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎర్రం తిరుపతి, ఆనంద్‌రావు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పనులు వాయిదా వేయొద్దు

- జీఎం శ్రీనివాస్


ఫైనాన్స్ మేనేజర్ గదిని ప్రారంభిస్తున్న జీఎం

రెబ్బెన: విభాగాల వారీగా పనులు పెండింగ్‌లో ఉంచుకోకుండా ఎప్పటికప్పుడూ పరిష్కరించుకోవాలని బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ ఎం.శ్రీనివాస్ అన్నారు. గురువారం గోలేటి టౌన్‌షిప్‌లోని జీఎం కార్యాలయంలో ఆధునీకరించిన ఫైనాన్స్ మేనేజర్ గదిని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీఎం కార్యాలయంలో పని చేసే ఉద్యోగులు సమయపాలన పాటిస్తూ సకాలంలో విధులకు హాజరవుతున్నారన్నారు. విధుల పట్ల ఉద్యోగులు చూపుతున్న అంకితభావాన్ని అభినందించారు. జీఎం కార్యాలయానికి పనుల నిమిత్తం వచ్చే ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు, సింగరేణి ప్రభావిత గ్రామాల ప్రజల కోసం విజిటర్స్ గదిని ఏర్పాటు చేసి సౌకర్యాలను కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్‌వో టూజీఎం రాజమల్లు, ఏరియా సర్వే అధికారి చంద్రశేఖర్, డీజీఎం ఐఈడీ ఉజ్వల్‌కుమార్ బెహెరా, పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి, ఫైనాన్స్ మేనేజర్ రవికుమార్, సివిల్ ఎస్ఈ మదీనా బాషా, సీనియర్ అకౌంట్స్ అధికారిణి సౌమ్య తదితరులు పాల్గొన్నారు.

ఇళ్లు లేక ఇక్కట్లు..!


పాత రేకులే గోడలు


గోడ కూలడంతో కట్టిన తడక

కెరమెరి: మండలంలోని బాబేఝరి గ్రామంలో ఆదివాసీలు సమస్యలతో సవాసం చేస్తున్నారు. గ్రామంలో 25 కుటుంబాలు ఉండగా 125 మంది జనాభా నివసిస్తున్నారు. అయితే గ్రామంలో సరైన ఇళ్లు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలో కొందరికి గూన ఇళ్లు ఉండగా, మరికొందరికి రేకుల ఇళ్లు ఉన్నాయి. కొందరి ఇళ్లకు ఉన్న గోడలు కూలిపోవడంతో తడకలు చుట్టి కాలం వెళ్లదీస్తున్నారు. మరికొందరు పాత రేకులను గోడలుగా వినియోగిస్తున్నారు. ఏ కొద్ది వర్షం కురిసినా గ్రామంలోని ఇళ్లలోకి నీరు వచ్చి చేరుతోంది. దీంతో ఇంటి సామగ్రితో పాటు ఆహార ధాన్యాలు తడిసిపోతున్నాయి. కాగా ఇటీవల అధికారులు ఇందిరమ్మ గృహాల మంజూరుకు సర్వే ప్రారంభించడంతో ఆదివాసీల్లో ఆశలు చిగురించాయి. ప్రభుత్వం తమ పరిస్థితిని అర్థం చేసుకుని గ్రామంలో అందరు ఇళ్లు కట్టుకునేందుకు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

'గ్రామ పంచాయతీని విడదీయొద్దు'


రాస్తారోకో చేస్తున్న నాయకులు, స్థానికులు

కౌటాల: కౌటాల గ్రామ పంచాయతీని రెండు జీపీలుగా విడదీయొద్దని పలు పార్టీల నాయకులు, స్థానికులు గురువారం కౌటాల -కాగజ్‌నగర్ ప్రధాన రహదారిపై రాస్తారోకో చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కౌటాల పంచాయతీ పరిధిలోని సదాశివపేట, శివలింగపూర్, నదీమాబాద్‌ను కలిపి ఒక గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేయాలనే ఆలోచనను ప్రభుత్వం విరమించుకోవాలని తెలిపారు. కొత్త గ్రామ పంచాయతీ ఏర్పాటు చేస్తే అభివృద్ధి కుంటుపడుతుందని, కొంతమంది రాజకీయ నాయకులు తమ స్వార్థపూరిత ప్రయోజనాల కోసం గ్రామ పంచాయతీని విడదీసే కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. కౌటాల పరిధిలో కొత్త గ్రామ పంచాయతీని ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం కౌటాల తహసీల్దార్ పుష్పలతకు వినతిపత్రం అందించారు. అలాగే తాటిపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని బండలహెట్టి, గోవర్‌హెట్టిను ప్రత్యేక గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేయవద్దని స్థానికులు తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో నాయకులు కుమురం మాంతయ్య, బండి రాజేందర్‌గౌడ్, నక్క శంకర్, పెద్దపల్లి భీమయ్య, విజయ్, తిరుపతి, జనార్దన్, మధు, రవి, సాయికుమార్, వెంకటేశం తదితరులు ఉన్నారు.

ఎప్పటికి పూర్తయ్యేనో..!

దహెగాం: గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సబ్‌సెంటర్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తున్నా కింది స్థాయి అధికారుల నిర్లక్ష్యం కారణంగా భవన నిర్మాణాలు పూర్తి కావడంలేదు. రెండు సంవత్సరాల క్రితం ఎన్‌హెచ్‌ఎం కింద మండల కేంద్రంలో సబ్ సెంటర్ భవన నిర్మాణానికి రూ.16 లక్షలు మంజూరు చేసింది. పనులు ప్రారంభించిన కాంట్రాక్టర్ నిర్మాణం పూర్తి చేయకపోవడంతో స్థానికులకు వైద్యం అందని ద్రాక్షగా మారింది. సంబంధిత అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి సబ్‌సెంటర్‌ను పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

నిర్మాణం పూర్తి కాని సబ్‌సెంటర్ భవనం ➤

